సీనియర్ సివిల్ జడ్జి సెంట్రల్ జైలు సందర్శన

ఖైదీలకిచ్చే ఆహారాన్ని రుచి చూస్తున్న జడ్జి

రాజమహేంద్రవరం సిటీ : కేంద్ర కారాగారాన్ని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి శుక్రవారం సందర్శించారు. కారాగారంలోని ఆహార ప్రమాణాలు, ఖైదీలకు అందుతున్న వైద్య సేవలు, శుభ్రత తదితర అంశాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. వారికి లభించే న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. ఖైదీల తరపున ఉచితంగా వాదించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుందని స్పష్టం చేశారు. ఇందుకోసం పారా లీగల్ వాలంటీర్లు అందుబాటులో ఉంటారని, తమ అర్జీలను వారి ద్వారా సమర్పించాలని సూచించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను ఖైదీలు తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. న్యాయ సహాయం ప్రతి వ్యక్తి హక్కు అన్నారు.

భయపెడుతున్న స్క్రబ్ టైఫస్

- **అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం**
- **విస్తృత అవగాహన, పారిశుధ్య కార్యక్రమాలకు చర్యలు**

ప్రజాశక్తి– రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా కొద్ది రోజులుగా కలవర పెడుతున్న స్క్రబ్ టైఫస్ కీటకం కలకలం జిల్లాలోనూ మొదలైంది. జిల్లాలో శుక్రవారం ఒక్కరోజే సుమారు 10 మంది అనుమానితులు వైద్యులను ఆశ్రయించారు. అయితే వారిలో ఎటువంటి లక్షణాలు లేవని అధికారులు ధ్రువీకరించారు. ఇద్దరి శ్యాంపిల్స్ కాకినాడ జిజిహెచ్‌లోని విఆర్‌డిఎల్‌కు పంపించినట్లు జిల్లా ఫీవర్ సర్వే అధికారి తెలిపారు. ఎక్కువగా పొలాలు, అపరిశుభ్ర ప్రాంతాలు, మురికి వాడల్లో నివసించే లేదా సంచరించే వ్యక్తులను స్క్రబ్ టైఫస్ నల్లుల బారిన పడుతున్నారన్నారు. పొలాలు, గ్రామీణ ప్రాంతాల్లో పొదలు, మొక్కల్లో ఎక్కువగా ఈ కీటకం కనబడుతుందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. శరీరంపై ఈ నల్లులు కరిచిన ప్పుడు వాటి లాలాజలం ద్వారా బ్యాక్టీరియా మనిషిలోకి ప్రవేశిస్తుంది. తద్వారా మనిషి వివిధ

రుగ్మతలకు గురవుతాడు. నీరసపడం వంటి లక్షణాలు కనబడతాయి.

ప్రాణాంతకం కాదు

జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులను అప్రమత్తం చేశాం. ఇది ప్రాణాంతకం కాదు. సరైన జాగ్రత్తలు తీసుకుంటే ముందస్తుగానే దీన్ని నివారించొచ్చు. డీట్ కలిగిన పురుగుల నివారణి ఆయింట్మెంట్‌ను చర్మంపై రాసుకోవాలి. పొలాలు, పొదలు, గడ్డి, పశువుల పాకల్లో పని చేసేవారు లేదా ఆ ప్రాంతాల్లోకి వెళ్లేవారు పొడవాటి చొక్కాలు, ప్యాంటు, బూట్లు వంటివి ధరించాలి. వ్యక్తిగత పరిశుభ్రతను, పరిసరాల శుభ్రత అవసరం. కీటకం నల్లి కరిచిన ప్రదేశంలో నల్లటిమచ్చ కనబడితే లేదా అనుమానిత లక్షణాలు కనబడితే వైద్యులను సంప్రదించాలి.

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు,
డిఎంహెచ్‌ఒ, తూర్పు గోదావరి జిల్లా

స్క్రబ్ టైఫస్ లక్షణాలు

ఈ కీటకం కుడితే తొలుత ఎర్రని పుండు ఏర్పడి, క్రమేణా మాడిపోయినట్టు నల్లరంగులోకి మారుతుంది. ఇది పొలుసులతో కూడిన గాయం మాదిరి ఉంటుంది. నొప్పి ఉండదు.
నల్లి కరిచిన తర్వాత లక్షణాలు కనిపించడానికి 6 నుంచి 21 రోజుల వ్యవధి పడుతుంది. ఈ వ్యవధిలోనే బాక్టీరియా శరీరంలో వృద్ధి చెందుతుంది.
తీవ్ర జ్వరం, వణుకు, తలనొప్పి, పొడి దగ్గు, కండరాల నొప్పులు, దద్దుర్లు, వికారం, వాంతులు, కడుపు నొప్పి, వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి.
సకాలంలో చికిత్స చేయకపోతే బ్యాక్టీరియా మెదడుకు వ్యాపించడం, నిమోనియా, ఊపిరి తిత్తులు, కాలేయం, మూత్రపిండాలతో సహా పలు అవయవాలను ప్రభావితం చేస్తుంది.
అనుమానిత లక్షణాలున్న రోగికి రక్తపరీక్షలు, ఇతర వైద్యపరీక్షలతో స్క్రబ్ టైఫస్‌ను నిర్ధారిస్తారు. లక్షణాలను గుర్తించడం, సరైన సమయంలో చికిత్సతోనే రోగిని రక్షించే వీలుంటుంది.

వైద్యుల పర్యవేక్షణలో చికిత్స మేలు

స్క్రబ్ టైఫస్‌కు చికిత్స సాధారణమైందేనని, అంటువ్యాధి కాదని వైద్యులు చెబుతున్నారు. యాంటీ బయోటిక్స్ చికిత్సతోనే నయం చేయొచ్చు. సాధారణంగా డాక్సీసైక్లిన్, అజిత్రోమైసిన్ వంటి ఔషధాలతో గరిష్ఠంగా రెండు రోజుల వ్యవధిలోనే ఉప శమనం పొందొచ్చని వైద్యులు భరోసా ఇస్తున్నారు. ఈ ఔషధాలను రోగతీవ్రత, లక్షణాల మేరకు వైద్యనిపుణుల సూచనలు, సలహాలను పాటిస్తూ, వారి పర్యవేక్షణలోనే వినియోగించాలే తప్ప సొంతంగా నిర్ణయాలను తీసుకోరాదని హెచ్చరిస్తున్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విసి ప్రసన్నశ్రీ

నన్నయలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి – రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సులు శుక్రవారం ప్రారంభమైంది. 'వ్యవసాయ–ఆహార సాంకేతికత, ఔషధ ఆవిష్కరణ, పర్యావరణ స్థిరత్వంలో వాటి ఉపయోగాలు' అనే అంశంపై ఈ సదస్సు జరుగుతుంది. ముఖ్యఅతిథులుగా విసి ఎస్.ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి, కాన్ఫరెన్స్ చైర్మన్ అయోంకి పబ్లిష్కో సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ చంద్ర మౌళి పావులూరి, కన్వీనర్ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి ఆఫీసర్ ప్రొఫెసర్ బి.జగన్మోహన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ కె.దీప్తి హాజరయ్యారు. నన్నయ విగ్రహానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి ఎస్.ప్రసన్నశ్రీ మాట్లాడారు. అంతర్జాతీయ సదస్సు సామాజిక శ్రేయస్సు కోసం అంతర్–విభాగ పరిశోధన, ఆవిష్కరణలను పెంపొందించడానికి విశ్వవిద్యాలయం వేదికైందన్నారు. శాస్త్రం, సాంకేతికతలో వేగవంతమైన పురోగతులు సహజ ప్రక్రియల గురించి అవగాహనను నిరంతరం పునర్నిర్మించాయని తెలిపారు. భౌతిక, రసాయన మరియు జీవ శాస్త్రాల ఏకీకరణ స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, తదుపరి తరం ఔషధాలు మరియు పర్యావరణపరంగా బాధ్యతాయుతమైన సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయడంలో కీలకంగా మారిందన్నారు. డాక్టర్ ఎపిజె.అబ్దుల్ కలామ్‌తో సాన్నిహిత్యం చేసిన ప్రొఫెసర్ ఆర్‌జి సోంకవాడే ఈ అంతర్జాతీయ సదస్సులో కీలక ఉపన్యాసం అందించడం హర్షణీయమన్నారు. చక్కని అంతర్జాతీయ సదస్సును ఏర్పాటు చేసిన నిర్వహకులను అభినందించారు. దీనిలో కొల్హాపూర్ శివాజీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆర్.జి. సోంకవాడే మాట్లాడుతూ భారత ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రధాని ఇటీవల భారత సాంకేతిక పరిజ్ఞానికి సంబంధించి గొప్ప సందేశాన్ని దేశ ప్రజలకు ఇచ్చారని గుర్తు చేశారు. 67 శాతం యువత ఉన్న గొప్ప దేశం భారతదేశమని, సాంకేతిక పరమైన వినూత్న ఆలోచనలకు మన దేశంలో అవకాశాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విమానాల రద్దు కారణంగా తాను రాలేకపోయానని, విశ్వవిద్యాలయంలో చక్కని అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్న నిర్వహకులకు, వారికి చక్కని మార్గదర్శకం చేస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న విసికి కృతజ్ఞతలు తెలిపారు.

కాన్ఫరెన్స్ చైర్మన్ అయోంకి పబ్లిష్కో సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ చంద్రమౌళి పావులూరి మాట్లాడుతూ భౌతిక రసాయన, జీవశాస్త్ర అంశాలపై పరిశోధనలు ప్రకృతిని అర్థం చేసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ సదస్సుకు దేశ విదేశాల నుండి మూడు వందల మంది హాజరవుతున్నారన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య బి.జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించడానికి సహాయ సహకారాలు అందించిన విసికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సదస్సు సైన్స్ అధ్యాపకులకు భావి పరిశోధకులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అరగన్ లైఫ్ సైన్సెస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, వెస్ట్ ఫార్మా ఎన్విరాన్మెంటల్ విభాగాధిపతి బి.విజయసారథి, చైనాలోని తియాంజీన్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జాంజీ తదితరులు ఉపన్యసించారు.

హాస్టల్ విద్యార్థులకు దోమ తెరల పంపిణీ

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం రూరల్

బొమ్మూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతిగృహంలో 50మంది బాలికలకు దోమ తెరలను ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వసతిగృహ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అందులో భాగంగానే ఈ దోమతెరలను అందించామన్నారు. సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఎంపిడిఒ ఆర్మ్ స్ట్రాంగ్ మాట్లాడుతూ మండలంలో స్త్రీ–శిశు సంక్షేమ శాఖ నిధులను సమర్థవంతంగా వినియోగించి బిసి విద్యార్థులకు 100, గిరిజన విద్యార్థులకు 50, సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు 50 దోమ తెరలను అందిస్తున్నామన్నారు. సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు వంటసామాగ్రి అవసరాన్ని గుర్తించిన జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెఎన్. జ్యోతి శుక్రవారం తన సొంత నిధులు రూ.10వేల విలువైన గిన్నెలను అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్ వాయిదా

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం సిటీ

జిల్లాలో నిర్వహించ తలపెట్టిన సైన్స్ ఫెయిర్‌ను ఉన్నతాధికారుల సూచన మేరకు వాయిదా వేస్తున్నట్టు జిల్లా సైన్స్ ఆఫీసర్ జి.శ్రీనివాసనెహ్రూ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం అన్ని పాఠశాలల్లోనూ ఈ నెల 8న పాఠశాల స్థాయి, 10న మండల స్థాయి, 12న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ జరగాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఈ కార్యక్రమాలు వాయిదా పడ్డాయన్నారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని నెహ్రూ తెలిపారు.

ఫైర్ స్టేషన్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం రూరల్

స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మించనున్న అగ్నిమాపక కేంద్రానికి ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ అగ్నిమాపక కేంద్రాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. దీనితో పాటు జిల్లా అగ్నిమాపక అధికారి కార్యాలయాన్ని కూడా పైఅంతస్తులో ఏర్పాటు చేసే ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించామని తెలియజేశారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో అగ్ని ప్రమాద నివారణ చర్యలను బలోపేతం చేస్తూ, అవసరమైన అగ్నిమాపక పరికరాలు, యంత్రాలను సమకూర్చుకున్నామన్నారు. ఈ అత్యాధునిక అగ్నిమాపక కేంద్రం పుష్కరాల నాటికి అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎం.మార్టిన్‌లూథర్‌కింగ్, ఇతర అగ్నిమాపక శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల అధ్యక్షునిగా గోవిందరావు

ప్రజాశక్తి – బిక్కవోలు

యుటిఎఫ్ బిక్కవోలు మండల అధ్యక్షునిగా సిహెచ్.గోవిందరావు ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా సిహెచ్.వీరభద్రరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ 14 మందితో కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతామన్నారు.

కార్టూ'నిజం'



ఘనంగా పిటిఎం 3.0

మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్(పిటిఎం 3.0)ను జిల్లాలో పలుపాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం సిటీ

పాఠశాల ఒక దేవాలయం అని, ప్రాథమిక దశలోనే మంచి ప్రవర్తన, విద్యాబుద్ధులు అలవర్చుకోవాలని రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషనర్ రాహూల్ మీనా స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక వీరభద్రపురంలోని టౌన్ హాల్లో జరిగిన మెగా పేరెంట్స్–టీచర్స్ మీట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్, విద్యార్థుల ప్రదర్శనలను ఆయన తిలకించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎ.సూరిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు, ఎస్ఎంసి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

43వ వార్డు నాగరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన పిటిఎంలో ఎంఎల్ఎ వాసు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్ : ధవళేశ్వరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతర బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. అంతరిక్ష విజ్ఞానంలో ప్రతిభ చాటిన విద్యార్థిని కె.జెస్సీని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్మ్ స్ట్రాంగ్, ఎంఇఒలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాళ్లపూడి : ప్రతి విద్యార్థి చదువుకునే రోజుల్లో చదువుకునే రోజుల్లో ఒత్తిడికి గురికాకుండా ఆసక్తితో ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. పిటిఎం సందర్భంగా శుక్రవారం వేగేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అన్నదేవరపేటలో ఎలిమెంటరీ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. బోధన, మిడ్డేమీల్స్ వంటి వాటిపై ఆరా తీశారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వెనుకబడిన సబ్జెక్టులకు సంబంధించి జరుగుతున్న రీమెడియల్ క్లాసులకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ప్రభుత్వం భాగస్వామ్యంతో కలిసి పని పనిచేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎస్ఎ పీడీ సుభాషిణి, ఎంఇఒలు బాలామణి, నెహ్రూజీ, హెచ్ఎం రాధిక, స్థానిక నాయకులు అల్లూరి విక్రమాదిత్య, ముళ్లపూడి శ్రీరామచంద్రమూర్తి, కూచిపూడి గణపతి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలోని అక్షర సిద్ధి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో పాఠశాల ప్రెసిడెంట్ సనపల సత్యనారాయణ, వ్యవస్థాపక కరస్పాండెంట్ సనపల సత్యకళ ఆధ్వర్యంలో పిటిఎంను నిర్వహించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. బాలల దినోత్సవ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లోని విజేతలకు బహుమతులు అందించారు. హెచ్ఎం అడ్డాల డేవిడ్‌రాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. మండలంలోని పెద్దేవం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్ సమావేశాన్ని సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ ప్రారంభించారు. రావూరు పాడులో జరిగిన సమావేశంలో మాజీ ఎంపిటిసి రేకపల్లి ముత్యాలరావు పాల్గొన్నారు.

బిక్కవోలు : తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కలిసి పనిచేసి విద్యార్థులను ఉత్తమమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని అనపర్తి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పందలపాకలో పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పిటిఎం 3.0లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెరవలి : ముక్కామల ఎస్ఎన్‌పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలతో కూడిన సమాజం సృష్టించే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. విద్యార్థులకు స్వయంగా మధ్యాహ్న భోజనం వడ్డించారు. మాక్ అసెంబ్లీలో సత్తా చాటిన పమ్మి దీపికను, సాంస్కృతిక ప్రదర్శనలు చేసిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కేతా త్రిమూర్తులు, డిఎస్ఇఒ కె.వాసుదేవ రావు, ఎంఇఒ నూర్జహాన్, తహశీల్దార్ కె.నిరంజన్, ఎంపిడిఒ పద్మజ హెచ్ఎం విఘ్నేశ్వరరావు, ఎంపిపి కె.సీతారాం ప్రసాద్, వైస్ ఎంపిపి వేండ్ర శ్రీనివాస్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : ఉండ్రాజవరం జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి హెచ్ఎం ఎస్.లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన పిటిఎంలో సర్పంచ్ మెండే వెంకటరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తాడిపర్రులో పైడిపర్రు, తేతలిలో లయన్స్ క్లబ్ క్లబ్ సభ్యులు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. హెచ్ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పసల సుబ్బారావు, గ్రామ పెద్దలు సింహాద్రి రామకృష్ణ, వి.బాలాజీ, బి.కళారావు, ఎం. రామచంద్రరావు, వైద్యాధికారి డాక్టర్ దుర్గా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు : మండలంలో శుక్రవారం మండల పరిషత్ స్కూల్, యుపి స్కూల్, జడ్‌పి ఉన్నత పాఠశాలలు. ఎస్‌విఆర్‌కె జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్ మీట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ కెవిఎస్.రామాంజ నేయులు, ఎంఇఒ–2 సుధాకర్, ఎఎంసి చైర్మన్ నాదల శ్రీరామ్, ఆళ్ళ హరిబాబు, కె.సాహెబ్ పేరెంట్స్ కమిటీ చైర్మన్లు, సభ్యులు విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

నిడదవోలు : పట్టణంలో చర్చిపేట డాక్టర్ బిఆర్. అంబేద్కర్ మున్సిపల్ పాఠశాలలో పిటిఎం శుక్రవారం జరిగింది. మున్సిపల్ చైర్మన భూపతి ఆదినారాయణ, కమిషనర్ టి.కృష్ణవేణి, జువ్వల రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. టిఎల్ఎం ఎగ్జిబిషన్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె.శ్రీనివాసరావు, ఎ.మాధవి, బి.వీరాస్వామి, పి.శ్రీదేవి, ఎం.రామకృష్ణ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొవ్వూరు : పేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం వాడపల్లి జడ్‌పి హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ రాణిసుస్మిత, టూమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, ఎంపిపి కాకర్ల నారాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ బూరుగుపల్లి వీర రాఘవులు, సర్పంచ్ గెల్లా ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరు రూరల్ ఐ.పంగిడి జడ్‌పి హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఎస్‌పి డి.నరసింహకిషోర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం పట్ల ఎలా ఉండాలో విద్యార్థులకు వివరించారు. చదువుతో పాటు ఆటలు, పాటల్లోనూ రాణించాలన్నారు. ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించాలన్నారు.

దేవరపల్లి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం మెగా పిటిఎమ్ 3.0ను నిర్వహించారు. మండలంలోని 34 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 11 ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. ప్రజాప్రతినిధులు, పిఎంసి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. గోపాలపురం నియోజకవర్గ డెవలప్మెంట్ ఆఫీసర్ భాగ్యవతి, మండల పరిషత్ అధికారి సిహెచ్.నాగార్జునరావు, ఇఒపిఆర్‌డి డి.సత్యనారాయణ, ఎంఇఒ కెఆర్ఎస్‌వివి.అప్పారావు పాల్గొన్నారు.

పెరవలిలో నిర్వహించిన పేరెంట్స్‌మీట్‌లో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

గోపాలపురం : గోపాలపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల అధ్యాపకుల సమావేశాన్ని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గోవాడ జాన్ పీటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మద్దిపాటి రమేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈలి శరత్ బాబు కంప్యూటర్, ప్రింటర్‌ను, గోపిన పవన్, మద్దిపాటి రోహిత్ బీరువాలను కళాశాలకు బహుకరించారు.

గోకవరం : గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పిటిఎంకు ముఖ్యఅతిథిగా జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ హాజరై మాట్లాడారు. ప్రపంచంతో పోటీపడే విధంగా నూతన టెక్నాలజీని విద్యార్థులకు మంత్రి లోకేష్ అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. మంత్రి నారా లోకేష్ తో మాట్లాడి గోకవరానికి డిగ్రీ కళాశాల తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ అడపా భరత్ కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు, సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము, సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, మండల కన్వీనర్ పిల్లా అర్జున సారథి, క్లస్టర్ ఇన్‌చార్జి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల : దూబచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ సాయాన్ని అందుకుని విద్యార్థులు చదువులపై దృష్టి సారించాలన్నారు. విద్యకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాడిగడప బాలయ్య, టిడిపి మండల అధ్యక్షులు తాతిని సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ రావూరి వెంకటరమణ, ఎంఇఒ వై.సత్యనారాయణ, భగవతి దేవి, స్కూల్ కమిటీ చైర్మన్ లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

తాళ్లపూడి అక్షరసిద్ధి పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

పేరెంట్స్ మీట్‌లో విద్యార్థులతో కలిసి కూర్చొన్న కలెక్టర్ కీర్తి చేకూరి

ఐ.పంగిడి జడ్‌పి పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్‌పి నరసింహకిశోర్

ధవళేశ్వరం బాలికోన్నత పాఠశాలలో మిడ్డేమీల్స్ చేస్తున్న ఎంఎల్ఎ

నేరాలు ఘోరాలు

7 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో ఒక మహిళ నుంచి ఏడు కేజీల గంజాయిని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు. తమకు అందిన సమాచారం మేరకు పురుషోత్తపట్నం బస్టాండ్ సెంటర్లో ఒక మహిళను గుర్తించి ఆమె వద్ద నుంయి ఏడు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. మహిళ మహారాష్ట్రకు చెందినదిగా గుర్తించామన్నారు. పురుషోత్తపట్నంలో అనుమానాస్పదంగా సంచరించడంతో స్థానికులు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారన్నారు. ఈ మేరకు పోలీసులు, విఆర్ఒలు పోసిపో బాబూరావు, వెంకటేశ్వరరావు సమక్షంలో మహిళను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

భూ తగాదాలో వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

భూమి తగాదా నేపథ్యంలో వ్యక్తిపై ఇరువురు దాడి చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇవి.. సఖినేటిపల్లి మండలం గొందితనేలుకు చెందిన కనుమూరి సాయి రాజు, సోదరుడు లక్ష్మీనరసింహరాజు, చెల్లెలు వరలక్ష్మిలకు తన తండ్రి సత్యనారాయణ రాజు ద్వారా అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం తాలూకా 51 సెంట్ల భూమి సంక్రమించింది. ఈ భూమి కోసం కొంతకాలంగా వివాదం జరుగుతోంది. తన తండ్రి మరణం తర్వాత నుంచి స్వామివారికి ఆస్తి పన్ను తానే కడుతున్నానని సాయిరాజు తెలిపారు. అయితే 2022 నుంచి ఈ ఆస్తిని తమ చెల్లెలు వరలక్ష్మి భర్త అల్లూరి బాలకృష్ణంరాజు అక్రమంగా బదలాయించుకున్నారని అన్నారు. దీనిపై ఎన్నిమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదన్నారు. తమ తండ్రి ద్వారా సంక్రమించిన భూమి వద్ద గురువారం శుభ్రం చేసేందుకు వెళ్లగా బాలకృష్ణంరాజు అనుచరులైన అల్లూరి సీతారామరాజు, పేరిచర్ల సత్యనారాయణ రాజు దాడి చేసి గాయపరిచారని సాయిరాజు తెలిపారు. చేతికి బలమైన గాయం కావడంతో రాజోలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సాయిరాజు చికిత్స పొందుతున్నారు. దీనిపై మెడికో లీగల్ కేసుగా పోలీసులు కేసు నమోదు చేశారు.

గోదావరిలో వృద్ధుని మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గౌతమి గోదావరి నదిలో ఒక వృద్ధుడు పడి మృతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదుచేశారు వారి వివరాలు ప్రకారం. మండలంలోని పులిదిండి గ్రామానికి చెందిన వల్లి సత్య నారాయణ (60) గత నెల 27న ఇంట్లో నుండి ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లాడు. సాయంత్రం అయినప్పటికీ ఇంటికి అతను తిరిగి రాలేదు. దీంతో అతని కోసం కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు అప్పట్లో సత్యనారాయణపై మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మండలంలోని పేరవరం గ్రామం వద్ద గౌతమి గోదావరి నదిలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- కపిలేశ్వరపురం

మండలంలోని వాకతిప్ప గ్రామ శివారులో గురువారం రాత్రి మృతదేహం లభ్యమయ్యింది. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. శుక్రవారం అంగర పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బుధవారం రాత్రి వాకతిప్ప గ్రామ శివారులో గడ్డివాము వద్ద గుర్తు తెలియని పురుషుని మృతదేహం ఉన్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు ఆ ప్రాంతాన్ని పరిశీలించినట్లు తెలిపారు. దీనిపై పక్క మండలాలకు సమాచారం ఇవ్వగా రామచంద్రపురం గ్రామానికి చెందిన గుబ్బల రమణ(59)గా గుర్తించారు. మృతుడు రామచంద్రాపురం మోడరన్ కాలేజీ నందు బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బస్సు కోరుమిల్లి గ్రామంలో పెట్టి దానిలో పడుకునేవాడన్నారు. గత 27వ తేదీ నుంచి అతను కనపడకపోవడం, చుట్టుపక్కల గాలించినా అతని ఆచూకీ తెలియలేదు. గురువారం రాత్రి గ్రామ శివారులోని డి.మణికంఠ పొలం గడ్డివాము దగ్గర మృత దేహాన్ని గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రమణ మృతదేహాన్ని అతని బావమరిది గుత్తుల శ్యామ్ గుర్తించాడు. అతడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు. శవపంచినామా నిమిత్తం మృతదేహాన్ని మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

హ్యాండ్ బాల్‌లో చాగల్లు విద్యార్థులకు బంగారు పతకం

ప్రజాశక్తి-చాగల్లు

రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీల్లో చాగల్లు విద్యార్థులకు బంగారు పతకం దక్కింది. ఈ నెల 1 నుంచి 3 వరకూ పల్నాడు జిల్లా పిడుగురాళ్ల ఈ పోటీలు జరిగాయని పీడీ జె.విజయలక్ష్మి తెలిపారు. ఈ జట్టులో 12 మందీ తమ పాఠశాల విద్యార్థులే ఉండటం గర్వకారణమని హెచ్‌ఎం వాసవి అన్నారు. బంగారు పతకం సాధించడమే కాకుండా జాతీయ స్థాయి పోటీలకు నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. విజేతలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది, దాత ఎమ్‌డి.నవీజ్ అభినందించారు.

టిడ్కో ఇళ్ల పనుల పరిశీలన

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పురపాలక సంఘ పరిధిలోని తీరుగూడెంలో గత ప్రభుత్వంలో నిలిచిపోయిన టిడ్కో గృహాల పునరుద్ధరణ పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ తోట కృష్ణవేణి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రంగా రమేష్, మోర్తా ప్రమోద్‌కుమార్, టిడ్కో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని వేగేశ్వరపురంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద జరుగుతున్న ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం 4వేల మందికి అన్నదానం చేశారు. సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు , సీర్ల బ్రహ్మానందం, గంగారావు తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బ్యారేజీ గేట్లకు తూట్లు

- గేట్లకు రంధ్రాలు పెట్టి రొయ్య సీడు సేకరణ
- గోదావరి దిగువకు వృథాగా పోతున్న సాగునీరు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ మధ్య డెల్టా కాలువ పరిధిలో గల లాంచీలు వెళ్లే మార్గంలో ఉన్న బ్యారేజీ గేట్లకు రంధ్రాలు పెట్టి రొయ్య సీడు సేకరణ చేస్తున్నారు. దీనిని నియంత్రించేందుకు గతంలో బొబ్బర్లంక గ్రామంలో మత్స్య శాఖ కార్యాలయం ఉండేది. మత్స్య శాఖ అధికారులు రొయ్య సీడు సేకరించి విక్రయించేవారు. దశాబ్దం కాలం నుంచి మత్స్య శాఖ అధికారులు రొయ్య సీడ్ సేకరించకపోవడంతో గ్రామానికి చెందిన కొంతమంది అనధికారంగా బ్యారేజీ గేట్లకు రంధ్రాలు పెట్టి రొయ్య సీడు సేకరించి బహిరంగంగానే మార్కెట్లో అమ్ముకుంటున్నా వారిని అడ్డుకొనే నాథుడే కరువయ్యాడు. దీంతో వారు బ్యారేజీ పొడవునా గేట్లకు రంధ్రాలు పెట్టి రొయ్య సీడు సేకరించి బయట మార్కెట్లో అమ్ముకుని రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. దీని నియంత్రించవలసిన గోదావరి హెడ్ వర్క్ అధికారులు కానీ. మత్స్య శాఖ అధికారులు కానీ పట్టించుకోకపోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో గోదావరిలో నీటిమట్టం తగ్గడం తో ఉభయగోదావరి జిల్లాలోని పంట పొలాలకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా సీలేరు నది నుంచి గోదావరి నదికి నీర మళ్లించి రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా గోదావరి హెడ్ వర్క్ విభాగపు అధికారులు చూస్తున్నారు. ఈ తరుణంలో కాటన్ బ్యారేజీ ధవళేశ్వరం నుంచి బొబ్బర్లంక, మద్దూరు లంక, విజ్జేశ్వరం వరకు బ్యారేజీ పొడవునా గేట్లకు రంధ్రాలు పెట్టి రొయ్య సీడు సేకరించడంతో సాగునీరు అదనంగా గోదావరి దిగువకు సముద్రంలో కలిసిపోతుంది. బ్యారేజీ గేట్లకు రంధ్రాలు పెట్టడంతో షట్టర్లు పాడైపోయే ప్రమాదం లేకపోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో కాటన్ బ్యారేజీకి మూడంచెల భద్రత ఏర్పాటు చేసి పరి రక్షించేవారు. కానీ ఇప్పుడు గోదావరి హెడ్ వర్క్ పరిధిలోగల ఉద్యోగాలకు రిక్రూట్మెంట్ లేకపోవడంతో బ్యారేజీకి భద్రత కరువుతోంది.

మధ్య డెల్టా గేట్లకు రంధ్రాలు పెట్టి సేకరిస్తున్న రొయ్య సీడు

నార్కెడిమిల్లి వద్ద వృథాగా పోతున్న తాగు నీరు

పగిలిన పైప్‌లైన్. గోదావరి జలాలు వృథా

ప్రజాశక్తి - ఆత్రేయపురం

నార్కెడిమిల్లి గ్రామం వద్ద రాజవరం పొదలాడ ఆర్అండ్‌బి రోడ్డు చెంత బొబ్బర్లంక నుంచి గ్రామాలకు సరఫరా చేసే గోదావరి శుద్ధి జలలు పైపులైన్ పగిలిపోయింది. దీంతో రెండు నెలలుగా గోదావరి జలాలు వృథాగా పోతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధి చేసిన గోదావరి జలాలు వృథాగా పోతూ కలుషితం అవుతున్నాయి. మండలంలోని గ్రామాలలో తరచూ ఏదో ఒక ప్రదేశంలో పైప్‌లైన్లు పగిలి తాగు నీరు వృథాగా పోతోంది దీంతో మండలంలోని గ్రామాల ప్రజలకు గోదావరి జలాలు అందని ద్రాక్షగా మిగిలాయి.

రబీ సాగుకు సన్నద్ధం

ప్రజాశక్తి - రామచంద్రపురం

తొలకరి చేలు తడి ఆరకముందే రైతులు రబీ పనులను ప్రారంభించారు. శుక్రవారం రైతు లు దమ్ములు ప్రారంభించారు. దిత్వా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట చేలల్లో నీరు నిల్వ ఉండటంతో దమ్ములు చేయడానికి అనుకూలంగా ఉంది. రామ చంద్రపురం మండలంలో ఎకరాలలోనూ, కె.గంగవరం మండలంలోని 15 వేల ఎకరాల్లో, కాజులూరు మండలంలో 16 వేల ఎకరాల్లో రబీ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. తొలకరిలో నష్టాలు పూడ్చుకోవాలని రైతులు సేద్యం చేస్తున్నారు.

వేగాయమ్మపేట వద్ద దమ్ము చేస్తున్న రైతు

వర్షాలకు మొలకెత్తిన ధాన్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం

తుపాను ప్రభావంతో కొద్ది రోజులు వర్షాలు కురిశాయి. ఈ కారణంగా రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోయింది. దీంతో శుక్రవారం వాతావరణం తెరుపు ఇవ్వడంతో రైతులు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. అయితే పలుచోట్ల ధాన్యం తడిసిపోయి మొలకకెత్తడంతో రైతులకు మరింత నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఇప్పటి వరకూ పంట నష్టపరిహారం ప్రకటించకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తొలకరి పంట నష్టపరిహారం నమోదు ప్రక్రియ పూర్తయి నప్పటికీ దీనిపై ప్రభుత్వం ఇప్పటివరకూ ప్రకటన చేయలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రబీ పెట్టుబడులకు వెంటనే తొలకరి నష్టపరిహారం అందించాలని రైతులకు కోరుతున్నారు.

శివల మెయిన్ రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

వెంకటాయపాలెం హైస్కూల్ విద్యార్థులకు మెమెంటోలు అందిస్తున్న సర్పంచ్ సతీష్‌కుమారి

స్కూల్ గేమ్‌లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

వెంకటాయపాలెం హైస్కూల్లో శుక్రవారం స్కూల్ గేమ్స్‌లో విజయం సాధించిన విద్యార్థులకు గ్రామ సర్పంచ్ ఎల్లమెల సతీష్‌కుమారి బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో పాల్గొని విజేతలకు మెమెంటోలు అందజేసిన అనంతరం ఆమె ప్రసంగించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ దడాల రాజేశ్వరి, ఎంపిటిసి సభ్యురాలు కనితి వెంకటేశ్వరి, విద్యా కమిటీ వైస్ ఛైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాకుర్రు లో ధర్మపాల్ ను పరామర్శిస్తున్న అధికారులు, నాయకులు

ధర్మపాల్‌కు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

టిడిపి ఎస్‌సి. సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్‌ను శుక్రవారం సాకుర్రు గ్రామంలోని ఆయన స్వగృహంలో పలువురు పరామర్శించారు. ఇటీవల ఆయనకు చేతికి గాయమైన కారణంగా వైజాగ్ కిమ్స్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారు. ప్రస్తుతం ఆయన స్వగృహం లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ధర్మపాల్ ను పరామర్శించిన వారిలో అమలాపురం మునిసిపల్ కమిషనర్, సాకుర్రు గ్రామ హైస్కూల్ మెగా పేరెంట్స్ టీచర్స్ స్పెషల్ ఆఫీసర్ నిర్మల్‌కుమార్, డిఎల్‌పిఒ పెట్టా బొజ్జిరాజు, మండల పార్టీ అధ్యక్షులు చొల్లంగి సాయిబాబా, యూనిట్ ఇన్‌ఛార్జి ముత్తాబత్తుల రమణ, అజ్జరపు శేషులు, దారా బాలకృష్ణ, నాగాబత్తుల శివ, ములపర్తి వెంకన్న తదితరులు ఉన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

డిఎంహెచ్ఒ కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు

విలేకరిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా నాయకుడు శెట్టిబత్తుల తులసి రావు డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలోని జిల్లా కార్యాలయాల ప్రాంగణంలోని డిఎంహెచ్ఒ కార్యాలయం నందు శుక్రవారం వివిధ ప్రజాసంఘాల నాయకులు జిల్లా వైద్యధికారి దుర్గారావు దొరను కలిశారు. అల్లవరం మండలం గోడి పిహెచ్‌సిపై కాయకల్ప సూచిలో పేర్కొన్న దిగజారిన స్థాయిని ప్రచురించిన విలేకరిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకుడు కారెం వెంకటేశ్వర రావు, ఎపిఎంఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.సుధీర్, అల్లవరం ప్రెస్ క్లబ్ సభ్యులు గంటా అరుణ్ కుమార్ కట్టా మురళి, దంగేటి శ్రీనివాస్, త్రిమూర్తులు, రాజేంద్ర పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

ఉప్పలగుప్తంకు చెందిన కనకాల వెంకట సత్యనరసింహారావు, సంధ్యరూప దంపతులు, వారి కుటుంబ సభ్యులు, శుక్రవారం అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి అన్నప్రసాద ట్రస్ట్‌కు రూ.10,116 విరాళంగా సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. వీరికి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణ(చక్రి) శ్రీ స్వామివారి చిత్రపటమును అందజేశారు.

దళిత సేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - అమలాపురం

అంబేద్కర్ 69వ వర్థంతి సందర్భంగా స్థానిక ఎర్ర వంతెన దగ్గర బుద్ధా నాగరత్నం మెమోరియల్ బ్లడ్ బ్యాంక్ నందు దళిత సేన ఆధ్వర్యంలో దళిత సేన గ్రూప్ సభ్యులు శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దళితసేన అధ్యక్షుడు డేవిడ్ అంబేద్కర్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా కోనసీమ కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్.కారెం రవితేజ విచ్చేశారు. 25 మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో వాకపల్లి హరీష్, సాపే రమేష్, జిల్లెల్ల రమేష్, గెద్దాడ బుద్ధరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ప్రపంచ నేల దినోత్సవం

ప్రజాశక్తి- కె.గంగవరం

మండలంలోని 22 రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి మాట్లాడుతూ భూమాత రక్షణ కార్యక్రమంగా ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. దంగేరు-1రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సహాయ సంచాలకులు బి.నాగకుమార్, గ్రామ సర్పంచ్ కొప్పిశెట్టి వెంకటరమణ, ఉప సర్పంచ్ దాట్ల రామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - రావులపాలెం

స్థానిక బెతెస్థా ప్రార్థనా మందిరం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ మొదటి శుక్రవారం బెతెస్తాలో క్రిస్మస్ నిర్వహించుకోవడం సంతోష దాయకమన్నారు. కార్యక్రమంలో రెవరెండ్ విశ్వాసరావు, వారి కుటుంబసభ్యులు, చిలువూరి సతీష్ రాజు, కంఠంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాలగుమ్మి విద్యార్థులకు పలువురి అభినందన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన ధీరుభాయ్ అంబానీ క్విజ్ పోటీలలో పాలగుమ్మి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.ప్రసన్నకుమార్, ఎం.యశస్విని ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా విజేతలకు ట్యాబ్‌లను బహుమతిగా అందుకున్నారని హెచ్‌ఎం గుంట్రు వెంకటేశ్వర రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - కాట్రేనికోన

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ప్రభుత్వ పరంగా కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ నాగిడి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం కాట్రేనికోన లో ఆయన స్వగృహం వద్ద విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ముమ్మిడివరంలో అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినిని పల్లంకూరు గ్రామానికి చెందిన మోకా గిరిబాబు అపహరించి, అత్యాచారం చేయడంపై తమ ప్రభుత్వం ఇప్పటికే కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిందన్నారు. నిందితుడికి పార్టీ సభ్యత్వం ఉన్నంత మాత్రాన ఉపేక్షించదన్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పరంగా ఆదేశించిందని అన్నారు. స్థానిక ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు ఆదేశాల మేరకు నిందితుడు మోకా గిరిబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ, పార్టీ సభ్యత్వాన్ని రద్దుచేసిందని అన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఈ సమావేశంలో మండల టిడిపి అధ్యక్షులు, సర్పంచ్ చెల్లి సురేష్, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు ఇసుక పట్ల వెంకటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ కాలాడి వీరబాబు, అంగాని నరసింహమూర్తి, బొంబాయి వీరబాబు, రేవు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కడియం

స్క్రబ్ టైఫస్ జ్వరం విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కడియం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ జి.రత్న మాధురి తెలిపారు. స్క్రబ్ టైఫస్ కీటకాలు ఆగస్టు నుంచి ఫిబ్రవరి నెలల మధ్య దట్టమైన చెట్లు, వ్యవసాయ భూముల పక్కన నివసిస్తాయన్నారు. ఈ కీటకాలు కుట్టిన వారికి శరీరంపై చిన్న నల్ల దద్దుర్లు వస్తాయన్నారు. వణుకుతో కూడిన జ్వరం వస్తుందని, కొందరిలో తలనొప్పి, కండరాల నొప్పి, వాంతులు, వీరేచనాలు కూడా కలగొచ్చన్నారు. కొన్ని కేసుల్లో నల్ల మచ్చ కనిపించకపోయినా, మూడు రోజుల పైబడి జ్వరం ఉంటే కచ్చితంగా వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ వ్యాధి నిర్ధారణకు ఆసుపత్రిలో ర్యాపిడ్ టెస్ట్ చేస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి నందు ఎలిసా టెస్ట్ ద్వారా నిర్ధారించొచ్చన్నారు. అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే స్క్రబ్ టైఫస్ జ్వరాల వల్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాళ్లు, చేతులు కప్పి ఉంచేలా దుస్తులు ధరించాలని సూచించారు.

ఘనంగా సారంగదరుడు పుట్టినరోజు

ప్రజాశక్తి-గోకవరం

జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ సమక్షంలో వెదురుపాక టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి బత్తుల శ్రీనివాస్ సారంగదరుడు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ కేక్‌ను కట్ చేసి బత్తులకు తినిపించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఎంఎల్‌కు పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ అడపా భరత్ కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు, సూరంపాలెం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉంగరాల రాము, సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, మండల కన్వీనర్ పిల్లా చంటిబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నబాబు, సొసైటీ మాజీ చైర్మన్ దాసరి తమన్న దొర, తంటి కొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర, మాజీ జడ్‌పిటిసి పాలూరి బోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

పైపులైను పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని చాగల్లు గ్రామంలో బిసి కాలనీలో రూ.9.5 లక్షల డిఎంఎస్ నిధులతో నిర్మించే పైపలైను పనులకు కొవ్వూరు ఎఎంసి చైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్‌చౌదరి, టిడిపి సీనియర్ నాయకులు ఆళ్ల హరిబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల కోసం, ప్రజల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కేతా సాహెబ్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సువర్ణవేణికి సత్కారం

ప్రజాశక్తి-కడియం

సువర్ణవేణిని సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కడియం జిల్లా పరిషత్ హై స్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయిని డాక్టర్ బూసి సువర్ణవేణి హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ తూర్పుగోదావరి జిల్లా జనరల్ సెక్రటరీగా ఎంపికయ్యారు. శుక్రవారం మెగా పేరెంట్స్ కార్యక్రమం నిమిత్తం హైస్కూల్‌కు విచ్చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఆమెను సత్కరించారు. అలాగే హెచ్‌ఎం టి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, సర్పంచ్ మోసిగంటి సత్యవతి, మండల ప్రత్యేక అధికారి మల్లికార్జునరావు, తహసిల్దార్ సునీల్ కుమార్, ఎంఈఓ నాగేశ్వరరావు, మహిళా ఎస్సై ధనలక్ష్మి ప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ డే

కొవ్వూరు : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రతీ శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు టిడిపి కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన వినతుల స్వీకరించారు. నియోజకవర్గంలో పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం 9 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. ప్రధానంగా పింఛన్లు ఇప్పించాలని రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించాలని, రేషన్ కార్డులు ఇప్పించాలని, కుళాయిలు ఇప్పించాలని కోరుతూ వినతిపత్రాలు అందాయన్నారు. నియోజకవర్గ టిడిపి ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్ని పాల్గొన్నారు.

వృద్ధులు, వితంతువులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -గోపాలపురం

రక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో మెగా క్రిస్మస్ సందర్భంగా వృద్ధులు, వితంతువులకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. 150 మందికి పైగా నంది అవార్డు గ్రహీత బిషప్ డాక్టర్ జి. లియమ్స్, జి.మనీషే చేతుల మీదుగా దుప్పట్లు అందజేశారు. అనంతరం క్యాండిల్ సర్వీసు నిర్వహించి కేక్ కటింగ్ చేశారు. 200 మందికి పైగా విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రక్షణ సేవా సమితి వ్యవస్థాపకులు కన్నం దాసు, అధ్యక్షులు గల్లా ఎలీషా, జి.మధుబాబు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, VEGISETTI SUBRAMANYAM, S/o. Satyanarayana, R/o. D.No.2/20, Thokada Rajanagaram Mandal, East Godavari Dist., A.P. I have changed my name from VEGISETTY SUBRAMANYAM (Old Name) to VEGISETTI SUBRAMANYAM (New Name) hence after called as VEGISETTI SUBRAMANYAM for all purposes.

మహారాజశ్రీ 2వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు
రాజమహేంద్రవరం
O.S.No. 715/2024

Between:-
Karibandi Venkateswarao ...Platintiff
And
D1. Palukuri Srinivasa Rao, S/o. Suryanarayana, Hindu, aged 55 years, D.No.104-7-485, Adarsa Nagar, Hukumpeta, Rajamahendravaram, East Godavari District.
D2. Palukuri Seetha Mahalakshmi, W/o. Palukuri Srinivasa Rao, Hindu, aged 45 years, D.No.104-7-485, Adarsa Nagar, Hukumpeta, Rajamahendravaram, East Godavari District. ...1,2 Deffendants

పై నంబరు దావాలో 1,2 డిఫెండెంట్స్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది.16-12-2025** సం॥రం తేదీ ఉదయం **10.30ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టువారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
అవధానుల సుబ్బారావు
రాజమండ్రి 5-12-2025
అడ్వకేట్, రాజమండ్రి
సెల్.9440749548

CHANGE OF NAME

I, CHITTURI SUJATHA, W/o. Venkata Narayana Chitturi, R/o. D.No.2-151, Nadupalli, Peravalli Mandal, East Godavari Dist., A.P. I have changed my name from CHITTURI SUJATA (Old Name) to CHITTURI SUJATHA (New Name) hence after called as CHITTURI SUJATHA for all purposes.

మహారాజశ్రీ కొవ్వూరు PRINCIPAL సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు
I.A.181/2024, I.A.182/2024, I.A.183/2024 in O.S.No.218/2016

Between:-
ముళ్లపూడి కేశవరావు ...పిటిషనరు/వాది
మరియు
చుండ్రు కృష్ణమూర్తి(డైడ్) Propose lrs ...రెస్పాండెంట్/ప్రతివాది
2. చుండ్రు అనూరాధ
3. చుండ్రు వినయ్ కుమార్
4. చుండ్రు కళ్యాణి
To.
4. చుండ్రు కళ్యాణి D/o.(late) కృష్ణమూర్తి, డోర్‌నెం.2-222, రాపాక, H/o. రఘుదేవపురం, సీతానగరం మండలం, తూ॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన చుండ్రు కృష్ణమూర్తి చనిపోయినందున అతని కుమార్తె అయిన మిమ్ములను వారసురాలిగా, 4వ ప్రతివాదిగా యాడ్ చేయించమని కోరుచూ I.A.182/2024 పిటిషనుయున్ను, మరియు సదరు వారసుల పిటిషను దాఖలు చేయుటలో జర్గిన 150 రోజుల ఆలశ్యమును Condone చేయించమని కోరుచూ, I.A.183/2024 పిటిషనున్నూ, మరియు వారసుల పిటిషనున్నూ ఆలస్యంగా దాఖలు చేసినందున కలిగిన Abatement Order ను Setaside చేయించమని కోరుచూ I.A.181/2024, పిటిషనును, దాఖలు చేసి, సదరు పిటిషనుల పయి మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపినప్పటికిన్నీ మీరు తీసుకొనక Avade చేయుచున్నందున, యీ ప్రకటన ద్వారా తెలియచేయునదేమనగా మీకు పైన ఉదాహరించిన పిటిషనులలో ఎట్టి ఆక్షేపణలు వున్న యెడల మీరు **ది.12-12-2025**వ తేదీన ఉదయం **10.30ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరయి తెలియపరచుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించడమగునని యిందు మూలముగా మీకు తెలియజేయడమయినది.
యాగంటి చలపతి రావు
అడ్వకేటు, కొవ్వూరు
సెల్.9440480154

IN THE COURT OF THE Ist ADDL. DISTRICT JUDGE, RAJAHMUNDRY
E.P.No.4/2023, O.S.No. 191/2015

Between:-
V.Krishnaveni ...DHR
And
G.M.Sujatha & others ...JDR's
JDR1. Gollapalli Margaret Sujatha W/o. Joseph, D.No.45-2-33/1, Andhra Nagar, Rajhmundry.
JDR2. Pothula Helda W/o. Antony David, D.No.45-2-33/1, Andhra Nagar, Rajhmundry.
JDR3. Gollapalli Hepsiba D/o. Joseph, D.No.45-2-33/1, Andhra Nagar, Rajhmundry.
JDR4. Gollapalli Henna Grace D/o.Joseph, D.No.45-2-33/1, Andhra Nagar, Rajhmundry.
JDR5. Gollapalli Hananya Joy S/o. Joseph, D.No.45-2-33/1, Andhra Nagar, Rajhmundry.

పై నంబరులో మీకు శ్రీ కోర్టువారు నోటీసు నిమిత్తం **ది.22-12-2025** తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు వాయిదా రోజు ఉదయం **10.30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా కాని వకీలు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేని యడల మీ పరోక్షమందు తీర్మానించ బడును.
Rajahmundry 3-12-2025
C.H.V.Prasad
Advocate for DHR

PUBLICATION
IN THE COURT OF THE HON'BLE II ADDL DIST COURT : Dr. B. R. AMBEDKAR KONASEEMA DIST: AMALAPURAM
EP No.17 of 2019 In AC No: 614 of 2015

Between:
Shriram Finance Limited, (Formely known as Shriram Transport Finance Co. Ltd.,) Amalapuram Branch, rep by its GPA holder **B.Srinivas Reddy, Amalapuram** ...D.Hr.
Vs
Mattaparthi Ramesh & another ...J.Drs
1st Jdr: Mattaparthi Ramesh, S/o. Ramarao, D.No.9-70/A, Vutaguntasavaram, Komarigiripatnam, Bendamurulanka, Allavaram (M), Dr.B.R.Ambedkar Konaseema District.
2nd Jdr: Pothuri Venkataraju, S/o.Satyanarayana Raju, D.No.4-47/1, Gandhi Statue Road, Pidaka Street, Ryali, Atreyapuram (M), Dr.B.R.Ambedkar Konaseema District.

The above named D Hr company has instituted the above ARB EP against you, and the same stands posted to **12-12-2025** at **10.30 A.M.** for your appearance, you are hereby required to appear personally or through advocate attend before this Hon'ble court at 10.30 AM and file your objections if any, failing which the matter will be heard and determined in your absence exparte as per Law.
//by the orders of the Hon'ble court//
G.V.V.S.N. Guptha,
Advocate, Amalapuram
Amalapuram Dt.24-11-2025
Cell: 98494 70531